
ప్రజాశక్తి
మంగళవారం 16 జులై 2024
5
విజయనగరం



దేవాదాయ భూముల సాగుదారుల సమస్యలపై
20న విజయనగరంలో సదస్సు

ప్రజాశక్తి-గజపతినగరం

దేవాదాయ భూముల సాగుదారులు, కౌలురైతుల సమస్యలపై ఈ నెల 20న విజయనగరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి టి.పైడిపినాయుడు, రాకోటి రాములు తెలిపారు. ఈ మేరకు గజపతినగరంలో సోమవారం సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. సదస్సుకు కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగుంట హరిబాబు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, దేవాదాయ భూసాగు, కౌలుదారుల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ కె.వెంకటరమణ హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సుకు దేవాదాయ భూముల సాగుదారులు, కౌలురైతులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.సోములు పాల్గొన్నారు.



గ్రోత్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో ఇసుక నిల్వలు

ఉచితం ఉత్తిదే

- 'ఉచిత ఇసుక' ట్రాక్టర్ లోడు రూ.3,400కు పైనే
- అక్రమంగా తరలిస్తే రూ.1300 లోపే
- సరఫరా కేంద్రంలో కొనుగోలుకు ముందుకు రాని జనం
- ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కూటమి అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామన్న హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం ఉచిత ఇసుక కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఉచిత ఇసుకను సరఫరా చేసేందుకు బొబ్బిలి, డెంకాడ, కొత్తవలస మండలాల్లో ఇసుక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. రవాణా, నిర్వహణ ఛార్జీలతో టన్ను ఇసుకకు రూ.605 ధర నిర్ణయించింది. దీంతో 'ఉచిత ఇసుక' తీసుకునేందుకు ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు ముందుకు రావడం లేదు. ఉచితం ఉత్తుత్తిదేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఇసుక కేంద్రాలలో సరఫరా నత్తనడకన సాగుతుంది.

ట్రాక్టర్ ఇసుక రూ.3,400కు పైనే

ఉచిత ఇసుక కేంద్రాల్లో ఇసుక తరలిస్తే టన్నుకు రూ.605 చెల్లించాలి. ట్రాక్టర్‌కు నాలుగు టన్నుల ఇసుక పడుతుందనుకుంటే, ట్రాక్టర్‌కు రూ.2420 చెల్లించాలి. ట్రాక్టర్ అద్దె మరో రూ.వెయ్యి చెల్లించాలి. ట్రాక్టర్ అద్దె, ఇసుక కేంద్రంలో చెల్లించే సొమ్ముతో కలిపి రూ.3,400కు పైగా ఖర్చవుతోంది. దీంతో ఇసుక కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

అక్రమ ఇసుక రూ.1300 లోపే

వేగావతి నదిలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే ట్రాక్టర్ రూ.1200 నుంచి రూ.1300 వరకు అమ్ముతున్నారు. ఉచిత ఇసుక కేంద్రం నుంచి ట్రాక్టర్ ఇసుక తరలించాలంటే రూ.3,400 వరకు ఖర్చవుతోంది. అక్రమంగా తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్ ఇసుక తీసుకుంటే రూ.2 వేల వరకు మిగలడంతో ప్రజలు, కాంట్రాక్టర్లు, పరిశ్రమ యజమానులు వారి నుంచే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రాల నుంచి తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ ఇసుక కేంద్రాల వద్ద నుంచి తరలింపు నత్తనడకన సాగుతోంది.

కొనేవారు కరువు

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక వినియోగం రోజుకు 2 వేల టన్నుల నుంచి 3వేల టన్నుల వరకు ఉంటుంది. గ్రోత్ సెంటర్లో ఫెర్రో పరిశ్రమలకు తప్పనిసరిగా 500 టన్నుల వరకు ఇసుక అవసరం. భవన నిర్మాణానికి రోజుకు 2 వేల టన్నులకు పైగా ఉండాలి. ఇంత డిమాండ్ ఉన్నా, ప్రభుత్వ ఇసుక కేంద్రం వద్ద రోజుకు 50 టన్నుల ఇసుక వెళ్లడం కష్టసాధ్యంగా మారింది. గ్రోత్‌సెంటర్లో ఇసుక కేంద్రాన్ని ప్రభుత్వం ఈనెల 8న ప్రారంభించింది. మొదటి రెండు రోజుల్లో టన్ను ఇసుక కూడా వెళ్లలేదు. 10న 30 టన్నులు, 11న 32, 12న 32, 13న 32.5, 14న 40 టన్నులు, 15న మధ్యాహ్నం ఒంటి గంట వరకు 24 టన్నుల ఇసుక మాత్రమే బయటకు వెళ్లింది. వినియోగానికి తగ్గట్టుగా ఇసుక వెళ్లకపోవడంతో ఇసుక కేంద్రం వెలవెలపోతుంది.

ఆగని అక్రమ తవ్వకాలు

బొబ్బిలి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడలేదు. పెంట, రంగరాయపురానికి మధ్యలో, పారాది, కారాడ, రొంపల్లి వద్ద వేగావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలు రాత్రివేళల్లో యథేచ్ఛగా సాగడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రం నుంచి కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఇసుక ధర తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.



రామభద్రపురంలో మానవహారం చేస్తున్న ఐద్వా, సిఐటియు నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు

అత్యాచార నిందితుడిని
కఠినంగా శిక్షించాలి

ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి-రామభద్రపురం

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఎరకన్నదొరపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన స్థానిక గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. పసికందుపై లైంగిక దాడికి పాల్పడిన మానవ మృగానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి, వెంటనే శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు పుణ్యవతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను, అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, రాధ, లక్ష్మి, రమణి, రమ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి

గజపతినగరం : పసికందుపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కఠినంగా శిక్షించాలని, పసికందులను కూడా వదిలిపెట్టని దుర్మార్గుల మనసు మార్చాలని కోరుతూ గాంధీ విగ్రహానికి సిఐటియు ఆధ్వర్యాన వినతినిచ్చారు. అర్ధరాత్రి మహిళలు ఒంటరిగా నడిచినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టని మీరు ప్రకటించినదానికి విరుద్ధంగా మహిళా స్వాతంత్ర్యం మట్టిలో కలిసిపోతోందని తెలిపారు. మానవులు మృగాలుగా మారుతున్నారని, చట్టాలు కాగితాలకే పరిమితం చేస్తూ ప్రభుత్వాలు స్వాతంత్ర్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎం.సుభాషిని, పి.జ్యోతి, ఐద్వా నాయకులు ఆర్.హరికృష్ణవేణి పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు. పురిటిపెంట వద్ద ఐద్వా ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. బంగారమ్మపేట గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.హరికృష్ణవేణి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, ఐద్వా నాయకులు కె.సుందరి, రాములమ్మ, తెర్లాపు అచ్చియమ్మ, అరుణ, కె.శుభ, కె.రిబ్కా, గీత, సీతమ్మ, గౌరమ్మ, శారద, రాధ, లక్ష్మి, మేరీకుమారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

బొబ్బిలి : లైంగిక దాడికి గురైన పసికందు కుటుంబానికి న్యాయం చేయాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసికందుపై లైంగిక దాడి చేయడం చూస్తే సమాజం ఎటుపోతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడికి ఉరిశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరసన

విజయనగరం టౌన్ : రామభద్రపురం మండలం జీలుగువలస గ్రామంలో ఐదు నెలల పసికందుపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు బోయన ఎరకందొరను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, ఐద్వా నాయకులు వి.లక్ష్మి, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణి మాట్లాడుతూ అత్యంత ఘోరంగా మన జిల్లాలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్ట కరమన్నారు. పసిపిల్లల నుండి వృద్ధుల వరకు అత్యాచారాలు, హత్యలు గత కొంతకాలంగా పెరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం మహిళా రక్షణ చట్టాలపై దృష్టి పెట్టి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు నాయకులు బి.రమణ, రామచంద్రరావు, రవి,హరీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైంగిక దాడికి ఖండన

ప్రశాంతతకు మారు పేరు అయిన విజయనగరం జిల్లాలో చిన్నారిపై లైంగిక దాడి ఘటనపై డిసిఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితుడి పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉండాలని, ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తగా ఉండాలని కోరారు.



గజపతినగరంలో గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న ఐద్వా నాయకులు

డిపాజిట్ల సొమ్ము చెల్లించాలని
కలెక్టరేట్ వద్ద సహారా బాధితుల ధర్నా

సహారా ఖాతాదారులకు, ఏజెంట్లకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం : సిఐటియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సహారా ఇండియా కంపెనీ ఏజెంట్లకు, డిపాజిట్ దారులకు, బాధితులకు తక్షణం డిపాజిట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన జిల్లాలోని సహారా బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. 2009-2010 మధ్యలో మొదలైన సహారా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్ బాండ్లకు వ్యతిరేకంగా ఆ సంస్థ యాజమాన్యం అక్రమ వసూళ్లు చేశారని సెబీ పేర్కొందని తెలిపారు. సుప్రీం కోర్టు 2012లో 15శాతర వడ్డీతో సహ ఖాతాదారులకు తిరిగి చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు యాజమాన్యం చెల్లించలేదన్నారు. సిఆర్‌సిఎస్ అనే పోర్టల్ ద్వారా దేశం మొత్తం ప్రతీ ఖాతాదారుడికి చెల్లింపులు చేస్తామని చెప్పిన కేంద్రమంత్రి అమిత్‌షా చెప్పి ఏడాదైనా ఇంతవరకు 5శాతం ఖాతాదారులకు కూడా చెల్లింపులు చేయలేదన్నారు. సహారా సంస్థ చేసిన తప్పులకు ఖాతాదారులు, ఏజెంట్లు బలయ్యారని అన్నారు. ఖాతాదారుల బ్యాంకు ఖాతాలలో మొత్తం సొమ్ము జమచేసి తమకు న్యాయం చేయాలని, లేనియెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ధర్నాలో దాసు, సూరిబాబు, ఎస్ఎ ఖాన్, టి.శ్రీనివాసరావు, ఎస్ఎం నాయుడు, సిమ్మ అప్పారావు, వి. కుమార్,సాయి, ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సహార బాధితులు, సిఐటియు నాయకులు

రైతులకు రవాణా ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 2021-22 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం విడుదల చేసిన రవాణా ఛార్జీలు రైతులకు అందలేదని, వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు ఎల్.ఆదినారాయణ కోరారు. సోమవారం గ్రీవెన్సులో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతినిచ్చారు. జిల్లాలో లక్కిడాం, పెంటశ్రీరాంపురం సొసైటీలు లో కొన్ని గ్రామాలు తప్ప జిల్లాలో ఎక్కడా చెల్లించలేదని తెలిపారు. వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గురువారం.. గ్రామ సందర్శన

- వారంలో ఒకరోజు అధికారుల బృందం గ్రామాల్లో పర్యటన
- ప్రభుత్వ సంస్థల పనితీరును సమీక్షించాలి
- మండల స్థాయిలో సమస్యలకు అక్కడే పరిష్కారం
- పట్టణాల్లోనూ వార్డు సందర్శన కార్యక్రమం
- మండలాలకు నోడల్ అధికారుల నియామకం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో జిల్లాలో గురువారం నుంచి గ్రామ, వార్డు సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. మండల నోడల్ అధికారి నేతృత్వంలో తహశీల్దార్, ఎంపిడిఒ, ఇతర మండలస్థాయి అధికారులతో కూడిన బృందం ప్రతి గురువారం మండలంలోని ఒక గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకొని మండల స్థాయిలో పరిష్కరించదగిన వాటిని అక్కడే పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారం కాని వాటిని జిల్లా స్థాయి అధికారులకు నివేదించాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ జిల్లా అధికారులతో నేరుగా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. గామ వార్డు సందర్శనకు వెళ్లే అధికారులు ఆయా గ్రామం లేదా వార్డులోని అన్ని ప్రభుత్వ సంస్థలను సందర్శించి ఆయా సంస్థల పనితీరును, ఆ సంస్థల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను సమీక్షించాలన్నారు. గ్రామంలోని వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది అందిస్తున్న సేవలను, వారి పనితీరును సమీక్షించాలని ఆదేశించారు. గ్రామంలో పాఠశాలలు సందర్శించి అక్కడ మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, మెనూ అమలు, విద్యార్థుల విషయ పరిజ్ఞానం పరీక్షించడం, స్కూల్ కిట్లు పంపిణీపై ఆరా తీయడం వంటి అంశాలపై సమీక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, రైతుసేవ కేంద్రాలు, రేషన్‌షాపులు తదితర సంస్థల పనితీరు, అందుతున్న సేవలను సమీక్షించి నివేదించాలన్నారు. పట్టణాల్లోనూ మున్సిపల్ కమిషనర్ నేతత్వంలో అధికారుల బృందం ప్రతి గురువారం ఒక వార్డులో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలానికి ఒక నోడల్ అధికారిని నియమించామన్నారు. ఆయా నోడల్ అధికారులు గురువారం నుంచి తమకు కేటాయించిన మండలాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఏ గ్రామంలోని ఇసుకను అక్కడే వినియోగించాలి

ఇసుక రీచ్ ల నుంచి గ్రామాల్లో స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుక వినియోగించేందుకు అనుమతించాలని కలెక్టర్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించేలా ప్రజల్లో అవగాహన కలిగించాలని డిఎంహెచ్‌ఒకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సుమబాల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు, ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోరాట కమిటీ కన్వీనర్ బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలసినన్ని నిధులు ఉన్నప్పటికీ 20-25 ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క ప్రాజెక్టు పనులను పాలకులు పూర్తి చేయలేదన్నారు. తోటపల్లి ప్రాజెక్టు 2004లో ప్రాజెక్ట్ పనులు ప్రారంభమై నేటికి 40 వేల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వలేకపోతోందన్నారు. జంఝావతి రిజర్వాయర్ పనులు చేపట్టి నాలుగు దశాబ్దాలు గడుస్తున్న నేటికీ ప్రాజెక్టు పూర్తి కాలేదన్నారు. తాటిపూడి రిజర్వాయర్ సాగునీటి ప్రాజెక్టు అనుకున్న కాలం గడు ముగిసినప్పటికీ సెంటు భూమికి నీరు ఇవ్వడానికి తీవ్ర అభ్యంతరాలు చెబుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ప్రాజెక్టులలో పేరుకుపోయిన మేటలను తొలగించాలని కోరారు.

'భీమసింగి' తిరిగే ఏర్పాట్లు చేయండి

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి

ప్రజాశక్తి-జామి

భీమసింగి చక్కెర ఫ్యాక్టరీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కర్మాగారం తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం చక్కెర ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ విక్టర్ రాజ్, డిప్యూటీ కేన్ కమిషనర్ సత్యనారాయణను జిల్లా కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చక్కెర పరిశ్రమల మనుగడ సాగట్లేదని చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారని, ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తుందని చెప్పడం అభినందనీయమని అన్నారు. ఈ ఏడాది గానుగ సీజన్‌లోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ఉన్న అవకాశాలు త్వరగా పరిశీలించి, రైతులకు తీపి కబురు అందించాలని కోరారు. దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ కొరత తీవ్రంగా ఉన్న కారణంగా భీమసింగి ఫ్యాక్టరీని ఇథనాల్ పరిశ్రమగా, లేకుంటే వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా, యువతకు ఉపాధి చూపించే స్కిల్స్ సెంటర్‌గా మార్చాలని కోరారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కర్మాగారంలో 16,873 మంది రైతులు భాగస్వామ్యంలో ఉన్నారని, 3,500 మంది నాన్ షేర్ హోల్డర్లుగా ఉన్నారని, 543 గ్రామాలు, రెండు జిల్లాల పరిధిలో ఈ ఫ్యాక్టరీ ఉందనే విషయాన్ని పాలకులు మరచిపోరాదని చెప్పారు. కర్మాగారం పేరు నిర్వీర్యం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట జాగరపు ఈశ్వరప్రసాద్, గొర్రిపాటి శ్రీనివాసరావు, సిరికి అప్పారావు పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న బీశెట్టి బాబ్జీ

మంత్రి మాటలపై రాద్ధాంతం చేయొద్దు : టిడిపి

జామి : భీమసింగి చక్కెర పరిశ్రమపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాటలను వక్రీకరిస్తున్నారని, ఫ్యాక్టరీ పురోభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి మండల అధ్యక్షులు పి.స్వామినాయుడు అన్నారు. ఈ మేరకు జామిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి దృష్టికి భీమసింగి చక్కెర పరిశ్రమ విషయాన్ని తీసుకెళ్లి నడిపేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాకు చిన్నతరహా పరిశ్రమలు తీసుకొచ్చి, ఈ ప్రాంత వాసులకు ఉపాధి కల్పించాలన్న యోచనలో మంత్రి పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కొత్తలి సూర్యారావు, వర్రి రమణ, ధనియాలా పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు ఆశనిపాతం

భీమసింగి సుగర్స్ మాజీ చైర్‌పర్సన్ లలిత

జామి : రాష్ట్ర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భీమసింగి సుగర్ ఫ్యాక్టరీపై చేసిన వ్యాఖ్యలు రైతులకు ఆశనిపాతంగా మారాయని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్‌పర్సన్ గులిపల్లి లలిత పేర్కొన్నారు. ఇటీవల మంత్రి ఢిల్లీలో పర్యటించి పరిశ్రమలు ఏ విధంగా నెలకొల్పాలో అధ్యయనం చేశారని, పక్కనే ఉన్న ఉత్తరప్రదేశ్ వెళ్లి చక్కెర పరిశ్రమలను ఏ విధంగా ఆదుకోవాలి, ఏ విధంగా చేస్తే లాభాలతో నడపడం సాధ్యమవుతుందో అధ్యయనం చేస్తే బాగుండేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో ఉన్న ఏకైక పరిశ్రమ భీమసింగి సుగర్స్ మాత్రమేనని, నష్టాలను చూపి శాశ్వతంగా మూసివేసేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వడానికి చూస్తున్నారని, అది సరైన విధానం కాదని తెలిపారు. ఫ్యాక్టరీ తాత్కాలంగా మూసివేసిన సమయంలో సుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా కొండపల్లి కొండలరావుకు అవకాశం రానందున ఫ్యాక్టరీ మూసివేతకు అతనే కుట్ర పన్నారని, నాపై హైకోర్టుకు వెళ్లి తాత్కాలికమైన స్టేట్ తెప్పించారని తెలిపారు. తాను చైర్‌పర్సన్‌గా ఉంటే పరిశ్రమ మూతపడ్డానికి ఫైల్‌పై సంతకం పెట్టేదాన్ని కాదని తెలిపారు. కార్మికులకు కర్షకులకు ఉపయోగపడే సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రతి సమస్యకూ వారంలో పరిష్కారం

23 నుంచి 27 వరకు ఆధార్ అప్‌డేషన్‌పై ప్రత్యేక శిబిరాలు : కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఈ కార్యక్రమానికి 188 వినతులు అందాయి. అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 110 వినతులు వచ్చాయి. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ మండలంలోనూ అక్రమ మైనింగ్ తవ్వకాలపై తహశీల్దార్‌లు గట్టి నిఘా వుంచాలన్నారు. ఆధార్‌లో ఆయా వ్యక్తుల తాజా సమాచారంతో అప్‌డేషన్ చేసే నిమిత్తం జిల్లాలో జూలై 23 నుంచి 27 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లల సమాచారం తప్పనిసరిగా నమోదు చేయడం, 18 ఏళ్లకు పైబడిన వారి సమాచారం అప్‌డేట్ చేయడం, పేర్లలో తప్పుల సవరణ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

రెడ్ క్రాస్‌కు రూ.35 వేలు విరాళం

ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధిలో సి.సి.కెమెరాల ఏర్పాటు కోసం నా ఊరు విజయనగరం సంస్థ అధ్యక్షురాలు గుమ్మలూరు విశాలాక్షి రూ.35 వేలు విరాళాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

సచివాలయాలను ప్రభుత్వ భవనాలకు మార్చాలి

అద్దె భవనాల్లో ఉన్న సచివాలయాలను ప్రభుత్వ భవనాలకు మార్చాలని టిడిపి నాయకులు కలెక్టర్‌కు వినతిచ్చారు. నగర పాలక సంస్థలో ఉన్న 50 డివిజన్లకు సంబంధించి 61 సచివాలయాల్లో సుమారు 53 కార్యాలయాలు అద్దె భవనాలలో ఉంటున్నాయని, వాటి అద్దె నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుండి చెల్లిస్తున్నారని తెలిపారు. అందువలన సచివాలయాలను ప్రభుత్వ భవనాలలో నిర్వహించాలన్నారు, కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్



విశాఖలో ఇటీవల జరిగిన రెండో సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం డిఇఒ ప్రేమ్‌కుమార్ తన కార్యాలయంలో అభినందించారు. వీ షోటోకాన్ డూ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. - ప్రజాశక్తి, విజయనగరంటౌన్

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక నకు 14 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలపై కమిషనర్ ఎం.ఎం నాయుడునకు అందజేశారు. ఆయా వినతుల పరిష్కారానికై సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎసిపి అమ్మాజీ రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా సామాజిక తనిఖీ చేయాలి

ప్రజాశక్తి-గజపతినగరం

సామాజిక తనిఖీ సక్రమంగా చేయాలని ఎంపిడిఒ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోషల్ ఆడిట్, ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 - 24 సంవత్సరానికి రూ.19.20 కోట్లతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. సిబ్బందికి మౌలిక సదుపాయాలు, వసతి కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీలో జరిగిన పనులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సిహెచ్.రామారావు, జెడ్‌పిటిసి గార తవుడు, ఎస్ఆర్‌పి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు చదరంగం క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయనగరంలో ఆగస్టు 3, 4న జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు బుధవారం క్రీడాకారుల ఎంపిక చేపడుతున్నట్లు చదరంగం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి ఎం.గణేష్ తెలిపారు. దాడితల్లి కాలనీలో ఉన్న ప్రజ్ఞ పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2017 జనవరి ఒకటికి ముందు జన్మించిన వారు అర్హులని, తప్పనిసరిగా బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 91823 37499కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

బల్లంకి పాల సంఘం అధ్యక్షులుగా ఈశ్వరరావు

ప్రజాశక్తి-వేపాడ



మండలంలోని విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షులుగా దేగల ఈశ్వరరావు ఎన్నికయ్యారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు బలపరిచిన ఈశ్వరరావు ఎన్నికయ్యారు. ప్రత్యర్థి, వైసిపి మద్దతుదారు బొద్దు శ్రీనుపై ఆరు ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈశ్వరరావుకు 77, శ్రీను 71 మంది ఓట్లు వేసినట్లు సూపర్వైజర్ నాయుడు తెలిపారు.

ఎంపిడిఒ కార్యాలయంలోనే దరఖాస్తుల స్వీకరణ

వేపాడ : ప్రజా సమస్యలపై ప్రతి సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోనే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపిడిఒ నిశ్చల తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు.

అద్దె భవనంలో ప్రభుత్వ పాఠశాల

భోగాపురం : మండలంలోని భోగాపురం పంచాయతీ చెరువు కొమ్ముగొల్లపేట ప్రాథమిక పాఠశాల సొంత భవనం లేక వేరొకరి ఇంట్లో తాత్కాలికంగా కొనసాగుతోంది. ఇప్పుడు ఆ ఇంటి యజమానికి ఇళ్ళు అవసరమై ఖాళీ చేయాలంటున్నారు. దీంతో ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. తాత్కాలిక షెడ్డు వేసుకోవడానికి మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణానికి కూడా ఎవరు ముందుకు రాలేదు. ఈ పాఠశాల సమస్యపై ఉపాధ్యాయులు ఎంఇఒకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలలో సుమారు 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకి గతంలో సొంత భవనం ఉన్నప్పటికీ అది శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడాది కిందట ఖాళీ చేయించారు. అప్పటి నుంచి గ్రామంలో వేరొకరి ఇంట్లో పాఠశాలను నిర్వహిస్తున్నారు. కానీ అక్కడ వారు కూడా ఖాళీ చేయాలని చెప్పడంతో పాఠశాలను ఎక్కడ నిర్వహించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాల పరిస్థితి చూసి అప్పట్లో ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి పాఠశాలలో తాత్కాలిక షెడ్డు వేసుకునేందుకు మండల పరిషత్ నిధుల నుంచి రెండు లక్షల రూపాయలు కేటాయించారు. కానీ దీనిని నిర్మించేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీనిపై ఎంఇఒ రమణమూర్తి మాట్లాడుతూ ఈ సమస్యను ఎంపిపి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రెండు మూడు రోజుల్లో తాత్కాలిక షెడ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని అన్నారు.

చేయూత డబ్బు జమ చేయాలి

గుర్ల : చేయూత లబ్ధిదారులకు వెంటనే వారి బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేయాలని దమరసింగి గ్రామానికి చెందిన లబ్ధిదారులు సోమవారం ఎఒ శివప్రసాద్‌కు, ఇఒపిఆర్‌డి గాయత్రికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని దమరసింగి గ్రామానికి చెందిన 67 మంది లబ్ధిదారులకు రావలసిన చేయూత పథకం నగదు తమకు ఇంతవరకు అందలేదని, వాటిని ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వంలో తమకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని, సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి కారణంగా ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదన్నారు. కొంత మందికి డబ్బులు వచ్చి మరికొంత మందికి రాకపోవడం విచారకరమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వెంటనే నగదు వారి ఖాతాల్లో జమచేయాలని వినతిపత్రాన్ని అందించారు.

ఎమ్మెల్యే మాధవిని సత్కరించిన పవన్

భోగాపురం : నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవిని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ సోమవారం సత్కరించారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారందరిని మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ సత్కరించారు. దీనిలో భాగంగా పండ్లు, కాయగూరలతో కూడిన బుట్టను ఇచ్చి ఎమ్మెల్యేను కూడా సత్కరించారు.

విద్యార్థికి ఆర్థిక సహకారం

విజయనగరం టౌన్ : ఉన్నత చదువులు చదివేందుకు పేద ఆర్యవైశ్య విద్యార్థులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా ఆర్యవైశ్య చారిటీ గ్రూప్ అధ్యక్షుడు ఆలపాటి శేఖర్ అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వరదా శ్రీనివాసరావు కుమార్తె కామేశ్వరి ఉన్నత చదువులు చదివేందుకు రూ20 వేల అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి డిమ్మిరాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ తెలిపారు. సమస్యలు తెలుసుకునేందుకు ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు జోగినాయుడు తదితరులు పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకున్నారు.

తగ్గిన నువ్వు, పత్తి, చెరకు సాగు

స్వల్పంగా మొక్కజొన్న వైపు మళ్లిన రైతులు
వర్షాభావ పరిస్థితులు, సుగర్ ఫ్యాక్టరీల మూతే కారణం
ముమ్మరంగా వరి నారుపోత



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వర్షా భావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది నువ్వు సాగు ఘననీయంగా తగ్గింది. పెట్టుబడి భారం, మార్కెట్ సదుపాయం లేకపోవడం వల్ల పత్తి, జిల్లాలోని రెండు సుగర్ ఫ్యాక్టరీలు తెరుచుకునే పరిస్థితి లేకపోవడం వల్ల చెరకు సాగుకు రైతులు వెనుకడుగు వేశారు. మొక్కజొన్న సాగు విస్తీర్ణం మాత్రం కూడా స్వల్పంగా పెరిగింది. వరి సాగు ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 2,99,455 ఎకరాల్లో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ సీజన్‌లో 14,007 ఎకరాలు నువ్వుల సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు కేవలం 5,487 ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. గత ఏడాది ఇదే సమయానికి 8,530 ఎకరాల్లో నువ్వులసాగు నమోదైంది. ప్రస్తుతం పువ్వుదశలో ఉంది. సాధారణంగా ఏప్రిల్, మేనెలల్లోనే వీటి సాగు మొదలవుతుంది. ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోవడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గినట్టు వ్యవసాయ శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. కారణం ఏదైనా ఈఏడాది 3,043 ఎకరాల్లో నువ్వుల సాగు తగ్గిపోయింది. పత్తి సాధారణ విస్తీర్ణం 6,707 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1447 ఎకరాల్లో సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి 1762 ఎకరాల్లో నమోదైంది. 315ఎకరాల మేర విస్తీర్ణం తగ్గినట్టు లెక్క. పెట్టుబడులు పెరగడం, పంట చేతికి అందాక తగిన మద్ధతు ధర లేకపోవడం, ఎంతోకొంతకు అన్నట్టుగా దళారులకు అప్పగించడం వంటి పరిస్థితులు ఎదురవ్వడం వల్ల ఈ పంట విస్తీర్ణం తగ్గినట్టుగా తెలుస్తోంది. చెరకు సాగు విస్తీర్ణం 15,040 ఎకరాలు కాగా కేవలం 2,800 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే 1,535 ఎకరాల్లో తగ్గింది. ఆధునీకరణ పేరుతో మూసివేసిన భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరవకపోవడం, అటు లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీని కూడా మూసివేయడంతో రైతులు ఒకింత నిరుత్సాహంతో చెరకు సాగుతగ్గించుకున్నారు. కందులు, పెసలు, అరికెలు, సామలు, కొర్రలు వంటి మేజర్ మిల్లెట్స్ గత ఏడాది ఈపాటికి 8,427 ఎకరాల్లో సాగవ్వగా, ప్రస్తుతం 5,035 ఎకరాలకు మాత్రమే సాగయ్యాయి.

ఆశాజనకంగా వరి

ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరి సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 4,977.5 ఎకరాల్లో రైతులు వరి నారు వేశారు. ఇది సుమారు లక్ష ఎకరాలకు సారిపోతుందని అధికారుల అంచనా. మిగిలిన 1.25లక్షల ఎకరాకుల సరిపడా నారు పోయాల్సివుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారుపోత ముమ్మరంగానే సాగుతోంది. మొట్ట ప్రాంతంలో యద, డ్రమ్ సీడర్, నీటి వసతి ఉన్నచోట ఉబాలు ప్రారంభించారు. ఈ పద్ధతుల్లో ఇప్పటి వరకు 2,475 ఎకరాల్లో నాట్లు కూడా పడ్డాయి. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 35,055 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 8,410 ఎకరాల్లో సాగు కనిపిస్తోంది. గతేడాది ఇదే సమయానికి కేవలం 5వేల ఎకరాల్లో మాత్రమే సాగు ఉండేది. దీన్నిబట్టి పత్తి, నువ్వుల పంటలకు బదులు మొక్కజొన్నవైపు రైతులు మరలతున్నట్లు అర్థమౌతోంది. కానీ, నువ్వులు, పత్తి, చెరకు సాగుతో పోలిస్తే పెరిగిన మొక్కజొన్న విస్తీర్ణం నామ మాత్రమే. పంటల సాగులో హెచ్చుతగ్గులకు వర్షాభావ పరిస్థితులే కారణమని తెలుస్తోంది. జూన్‌లో 73 మిల్లీ మీటర్ల అధిక వర్షపాతం నమోదు కాగా, జులైలో ఇప్పటి వరకు 56 మి.మీ లోటు వర్షపాతం ఉంది.

దేవస్థానం భూమిని సాగుదారులకు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గంట్లాం రెవెన్యూ పరిధిలో ఉన్న శ్రీవిమర్శ ప్రకాశ విశ్వేశ్వర స్వామి దేవస్థానం భూమిని సాగుదారులకు ఇవ్వాలని మండల సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహాశీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. గ్రామంలో సాగుదారులైన పచ్చిపాల అప్పయ్య గతంలో సాగు చేసే వారిని వారి మనవడైన ఆదినారాయణ చెప్పారు. గతంలో సర్వే నెంబరు 18-166లో పల్లపు భూమి 96 ఎకరాలు, మెట్ట భూమి 26.12 ఎకరాలను తమ తాత తండ్రుల నుంచి సాగుచేశావారన్నారు. సాగు చేయడానికి పెట్టుబడి పెట్టలేక తమ పూర్వీకులు వలస వెళ్లిపోయారని, అనంతరం వారి వారసలమైన తాము సాగు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆ భూమిని తమకు అప్పగించాలని కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం పార్టీ మండల నాయకులు బి సూర్యనారాయణ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో 'మదర్ గార్డెన్'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో మదర్ గార్డెన్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎన్.తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణా రావు, అధ్యాపకబృందం, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- డెంకాడ

మహిళల లైంగిక వేధింపులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ రామారావు, ఎంపిడిఒ లవరాజు, సిడిపిఒ, ఎస్ఐ కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపులు చట్టాలపై అవగాహన కల్పించారు. పదిమంది అంతకన్నా తక్కువ ఉద్యోగులు ఉన్న ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లోని లైంగిక వేధింపులు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే మహిళ ఉద్యోగులు పనిచేస్తున్న ప్రతి కార్యాలయంలోనూ వారు తమ సమస్యను బహిర్గతంగా చెప్పుకోలేకపోవచ్చన్న ఉద్దేశంతో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రమణ, ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, శైలజరాని పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కమిటీలు

వేపాడ : పని ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ నిశ్చల, తహాశీల్దార్ సత్యం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణ చట్టంపై గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పిఒ లక్ష్మీబాయి, ఇఒపిఆర్‌డి ఉమ, ఎంఇఒ పి.బాలభాస్కరరావు, ఎస్ఐ రాజేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కామేశ్వరి, పి.భాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస.. మాట్లాడుతున్న ఎంపిడిఒ రమణయ్య

కొత్తవలస : పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం కచ్చితంగా అమలు చేయాలని ఎంపిడిఒ ఎస్.రమణయ్య, తహాశీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలను చిన్న చూపు చూడడం తగదని అన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను అరికట్టడానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని అన్నారు. మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.శ్రీనివాసరావు, సిడిపిఒ ఉమాదేవి, ఎపిఎం శ్రీనివాసరావు, న్యాయవాది డి.శ్రీనివాస్, అంగన్వాడీ సూపర్వైజర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శాఖలోనూ అంతులేని అవినీతి

ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి- చీపురుపల్లి

సమీక్ష చేసిన ప్రతీ శాఖలోనూ అవకతవకలు, ప్రజా ధనం దుర్వినియోగంతో అంతులేని అవినీతి గత ప్రభుత్వంలో జరిగిందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆకాశమే హద్దుగా అవినీతి జరిగిందన్నారు. సమీక్ష చేసిన విద్యుత్, పోలవరంతో పాటు అనేక శాఖలలో అక్రమాలు జరిగాయన్నారు. వేల కోట్ల రూపాయలలో అస్తవ్యస్థ కార్యక్రమాలు జరిగాయని రాష్ట్ర అబివృద్ధిని కుంటుపరిచి స్వలాభం కోసం రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ కూడా దుర్వినియోగం చేశారన్నారు. సుమారు 15 లక్షల కోట్ల మేర అప్పులు చేసారని ఆరోపించారు. ఒక్క వ్యవసాయ పని ముట్లుకి సంబంధించి సుమారు 7 వేల కోట్ల రూపాయల మేర బకాయిలు వివిధ కంపెనీలకు చెల్లించాల్సి ఉందన్నారు. ఒక్క శాతం కూడా రైతులకు సబ్సిడీపై పనిముట్లుని ఇవ్వలేదని జగన్‌మ్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రం పూర్తిగా భ్రష్టు పట్టిందని విమర్శించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఈ నెల 1వ తారీఖునే సుమారు పదివేల కోట్ల రూపాయలు మేర ఫించన్లతో పాటు ఉద్యోగస్తుల జీతాలు చెల్లించడం జరిగిందన్నారు. చంద్రబాబునాయుడు చీపురుపల్లి వచ్చినప్పుడు పోలవరంతో పాటు ఉత్తరాంధ్రకు సుజల స్రవంతి ద్వారా నీరందించడానికి హామీ ఇచ్చారని ఆ మేరకు ఆయన సుజల స్రవంతి పనులను పరిశీలించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో మూడు నెలల్లో కేవలం 31 శాతం మాత్రమే భోగాపురం ఎయిర్ పోర్టు పనులు జరిగాయన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే ఇప్పటికే భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పూర్తయ్యేవని అన్నారు. సమావేశంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సాయి సిద్ధార్థ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గజపతినగరం

వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా సోమవారం శ్రీ సాయి సిద్ధార్థ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 32 మంది రక్తదానం చేశారని ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ శీరంరెడ్డి చంద్రశేఖర్ అన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం పట్ల అవగాహన కలిగి ఉండాలని, రక్తదానం అంటే ప్రాణదానంతో సమానమని తెలిపారు. దీనిలో భాగంగా ఆయన కూడా 45వ సారి రక్తదానం చేశారు. ఆయన తనయ అపురూప కూడా రక్తదానం చేశారు. ఏరియా ఆసుపత్రి రక్త నిల్వల కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ బి.మైత్రేయి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, తలసేమియా వ్యాధిగ్రస్తులు, ఆసుపత్రిలో అత్యవసర సమయాలలో రక్తం కావలసినప్పుడు కరస్పాండెంట్ చంద్రశేఖర్ ఎల్లప్పుడూ తమ సహాయం చేస్తారని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ రవి పాల్గొన్నారు.



రక్తదానం శిబిరం నిర్వహిస్తున్న సాయిసిద్ధార్థ కాలేజీ కరస్పాండెంట్ చంద్రశేఖర్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి బి.మైత్రేయి

నిరాడంబరతకు నిదర్శనం సుబ్రమణ్య తిలక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరాడంబరతకు ప్రతిరూపమైన భారత ప్రథమ లోక్ సభ సభ్యులు కందాల సుబ్రహ్మణ్య తిలక్ జీవితాన్ని నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి ఆదితి గజపతిరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని కంటోన్మెంట్‌లో కందాల సుబ్రమణ్య తిలక్ 104వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తిలక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా తిలక్ ఫౌండేషన్ సమకూర్చిన స్కాలర్‌షిప్‌లను ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గురుస్వామి కందాళ సాయి బాబా, కోశాధికారి కెవి రామకష్ణ, కో-ఆర్డినేటర్ కొత్తలి ఎర్రి నాయుడు, ఫౌండేషన్ ప్రతినిధులు తిలక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత : విసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆమె చేతుల మీదుగా వెయిట్ లిఫ్టింగ్ హాలును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాలలో మొబైళ్లకు అతుక్కుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల మెదడు కూడా చురుగ్గా పనిచేస్తోందన్నారు. డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అధికారులు, యాజమాన్యం ప్రోత్సాహంతోనే క్రీడాకారులను ప్రోత్సహించగలుగుతు న్నామన్నారు. అంతర్జాతీయ రిఫరీ ఆర్‌విఎల్ఎన్. రత్నాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించినపుడే వారు పతకాలు సాధించగలరని అన్నారు. ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కె.సూర్యనారాయణ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బి.వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా క్రీడాకారులకు టిఎ, డిఎ వంటి ప్రోత్సాహకాలను ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారి బి.సూరిబాబు, జిల్లా అధ్యక్షురాలు బి.లక్ష్మి నరేంద్ర, కార్యదర్శి చల్లా రాము, డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అవనాపు సూరిబాబు జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మున్సిపల్ మాజీ ఛైర్మన్ కీర్తిశేషులు అవనాపు సూరిబాబు 74వ జయంతి పుచ్చలవీధి లోని అవనాపు కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. సూరిబాబు కుమారుడు అవనాపు విక్రమ్, కోడలు అవనాపు భావన, కాళ్ళ గౌరీ శంకర్, అవనాపు జనార్ధనరావు, కనకల మురళీమోహన్, గాడు అప్పారావు తదితరులు సూరిబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అవనాపు విక్రమ్, భావన దంపతుల చేతుల మీదుగా సూరిబాబు జ్ఞాపకార్థం గొడుగులు పంపిణి చేసారు. నాగవంశ సంక్షేమ సంఘానికి సుమారు రూ.6.50లక్షలతో సమకూర్చిన అంతిమ యాత్ర వాహనాన్ని బహుకరించారు. కార్యక్రమంలో నాగవంశ సామాజికవర్గం పెద్దలు, యువత, అవనాపు అభిమానులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శంబంగి

బొబ్బిలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. రైతులు, ప్రజా సమస్యలు పరిష్కారానికి నిష్పక్షపాతంగా పని చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆయనతో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఉన్నారు.

సెల్ టవర్ తొలగించాలని ఆందోళన

వంగర : మండలంలోని కొండ చాకరాపల్లిలో నిర్మించిన సెల్ టవర్ ను తొలగించాలంటూ గ్రామస్తులు సెల్ టవర్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఇళ్ల మధ్యన సెల్ టవర్ ఉండటం వల్ల అనేక రోగాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నామని, సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియోషన్ ప్రభావంతో కేన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామంలో నిర్మించి ఉన్న సెల్ టవర్‌కు 5జి నెట్‌వర్క్ పునరుద్ధరించేందుకు నిపుణులు రాగా గ్రామస్తులు అడ్డుకున్నారు.

ఘనంగా కెవిఆర్ జన్మదిన వేడుకలు

మెరకముడిదాం : వైసిపి మండల అధ్యక్షులు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు జన్మదిన వేడుకలు కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. సోమవారం ఆయన చిన బంటుపల్లి గ్రామంలో ఉన్న మిల్ ఆవరణలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజు శుభాకాంక్షలు వేడుకలకు హాజరైయిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. వైసిపి కార్యకర్తలకు ఆపదలో అండగా ఉంటానని చెప్పారు.